క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరం

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ నకిరేకల్ వారి ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి హాస్పటల్ సౌజన్యంతో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 120 మందికి కంటి పరీక్షలు చేసి 32 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్లు వీరబ్రహ్మం, రాజేంద్ర ప్రసాద్, టీం బృందం విజయ్, విట్టల్ రావు, దుస్స సత్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, తక్కలపల్లి ప్రభాకర్‌రావు, యాదగిరిరెడ్డి, రఘునమ్మ, రమాదేవి, సూర్య చంద్రరావు, రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

నకిరేకల్ : రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ తీసుకునే విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటామని నకిరేకల్ ఎస్‌బీఐ(వీటీ కాలనీ) బ్రాంచ్ మేనేజర్ పద్మావతి అన్నారు. రిటైర్డు ఉద్యోగులకు బ్యాంక్ తరపున ఇచ్చే రుణ సదుపాయాలపై గురువారం స్థానిక సంఘం భవనంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంటల రామలింగం, ప్రధాన కార్యదర్శి కందుల సోమయ్య, బాదిని లింగయ్య, భిక్షంరెడ్డి, వీరమల్ల రవీందర్, పోతుల వెంకటనారాయణ, ప్రభాకర్, జంగయ్య, కృష్ణారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులు ఐక్యం కావాలి

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమకారులందరూ ఐక్యం కావాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జిల్లపల్లి ఇంద్ర అన్నారు. గురువారం స్థానికంగా నిర్వహించిన అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఐఆర్ లేని ఉద్యమకారులకు ప్రభుత్వం ఇస్తామన్న హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 250 గజాల స్థలం, గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్, యలమంద, యాదయ్య పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

మునుగోడు: బెల్టు దుకాణాలకు అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మునుగోడు పట్టణంలోని ఓ వైన్స్‌షాపుపై మునుగోడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన దోటి నర్సింహ తన కిరాణం దుకాణంలో బెల్టు షాపు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయిస్తున్నాడు. బుధవారం రాత్రి పోలీసులు వెళ్లి సోదాలు చేయగా అతడి వద్ద 90 ఎంఎల్ బాటిళ్లు 3, క్వాటర్ బాటిళ్లు 8 పట్టుబడ్డాయి. దోటి నర్సింహతోపాటు అతడికి మద్యం విక్రయించిన మద్యం దుకాణంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నకిరేకల్ : బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఝాన్సీ అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రజ్ఞాపురం వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సంస్థ ప్రతినిధి కవిత, ఉపాధ్యాయులు మోసంగి హరీష్ చంద్ర, సాగర్ల సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్ నాగమణి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

నల్లగొండ : చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణిని ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జీవిత చరిత్ర 'ధీర వనిత సీతక్క' పుస్తకాన్ని అందించారు. అదేవిధంగా మార్నింగ్ వాక్ సమయంలో ఎన్జీ కళాశాల మైదానం, డాక్టర్ నోముల సత్యనారాయణ కార్నర్‌లో వాకర్స్‌కు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సంఘం అధ్యక్షుడు రాంబాబు, జగన్‌మోహన్‌రావు, చింతపల్లి వెంకన్న, పెరుమళ్ళ వెంకటేశం, నర్రా శేఖర్‌రెడ్డి, జూలకంటి సైదిరెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

కుర్చీలు బహూకరణ



కుర్చీలు అందజేస్తున్న హరికృష్ణ

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ గురువారం కుర్చీలను కళాశాల ప్రిన్సిపాల్ మదనాచారికి అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, వీరయ్య, రాజ్‌కుమార్, మధుసూదన్, ఉపేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



నల్లగొండ : చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, మున్సిల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



నల్లగొండ : ర్యాలీ నిర్వహిస్తున్న రజక సంఘం నాయకులు



చండూరు మున్సిపల్ కార్యాలయంలో..



గట్టుప్పల్ తహసీల్దారు కార్యాలయంలో..



చిట్యాల: పెద్దకాపర్తిలో ..



కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో..



శాలిగౌరారం : ఎంపీడీఓ కార్యాలయంలో..



నార్కట్‌పల్లి : అమ్మనబోలులో..



కేతేపల్లిలో..



రామగిరి(నల్లగొండ): ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జూనియర్ కళాశాల సిబ్బంది



నల్లగొండ టూటౌన్ : ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



నకిరేకల్ : ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రజక సంఘం నాయకులు



మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల, సంఘాల నాయకులు

పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ

తిప్పర్తి : కిశోర బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా తిప్పర్తి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ స్లీవా, ఏఎన్‌ఎం శైలజ, అంగన్‌వాడీ టీచర్ జానమ్మ, ఆశా వర్కర్లు ధనమ్మ, సువర్ణ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు మండలం ఊకొండిలో..

మునుగోడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. నాగమణి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఊకొండి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు రాధిక, భద్రయ్య, ఏఎన్‌ఎం స్వరూప, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, జే.లింగమ్మ, ఉమారాణి పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి: చెర్వుగట్టులో పోషణ మాసోత్సవంలో పాల్గొన్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

నార్కట్‌పల్లి : కూరగాయలు, పండ్లు, గింజలు, నిత్యవసరాల నుంచి అతి తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, కామినేని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబాసాహెబ్ కూడగి అన్నారు. గురువారం చెర్వుగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ, కామినేని వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ కోలోనాల్ లూధర్, సీహెచ్‌ఓ శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్, ఆర్‌బీఐ ఆధ్వర్యంలో గురువారం బ్యాంకింగ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ డీజీఎం జగదీష్ పాల్గొని రేపో రేట్, ధరల అదుపు, రుణాలు, బ్యాంకింగ్ రంగంలో ఆర్‌బీఐ పాత్రపై విద్యార్థులకు వివరించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛ భారత్‌పై నిర్వహించిన స్లోగన్స్, పెయింటింగ్, క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఏజీఎం గోమతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, ఎకనామిక్స్ అధ్యాపకుడు మునిస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఎం.వెంకటరెడ్డి, ఎన్.కోటయ్య, కె.శివరాణి, ఏ.మల్లేశం, అనిల్‌కుమార్, ఎం.సావిత్రి, పీఆర్‌ఓ డాక్టర్ వెల్దండి శ్రీధర్ పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్

రామగిరి(నల్లగొండ): పబ్లిక్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆధ్వర్యంలో పోషక ఆహారం మాసం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఎన్జీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోషక ఆహారంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గురువారం నల్లగొండలో జరిగిన వర్క్ షాపులో వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఎన్జీ కళాశాల విద్యార్థులకు అడిషనల్ కలెక్టర్ పూర్ణచందర్ మెమోంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్, జువాలజీ ఇన్‌చార్జ్ డాక్టర్ జ్యోత్స్న, రెడ్ రిబ్బన్ క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి, అధ్యాపకులు మహేశ్వరీ, సరిత అభినందించారు.

సీసీఎంబీని సందర్శించిన విద్యార్థులు

ఎన్జీ కళాశాలకు చెందిన 74 మంది మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ యూజీ విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని సీసీఎంబీని సందర్శించారు. శాస్త్రవేత్తలతో ముచ్చటించి శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, జీవకణ శాస్త్రం, బయోటెక్నాలజీ రంగాల్లో తాజా పరిశోధనల గురించి తెలుసుకున్నారు. మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ విభాగాల ఇన్‌చార్జ్‌లు బి. నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అంంజయ్య తదితరులు ఉన్నారు.

శ్రీలంకలో కమ్యూనిస్టుల గెలుపు శుభసూచకం

కేతేపల్లి: శ్రీలంక అధ్యక్షుడిగా కమ్యూనిస్టు నేత మార దిశనాయక్‌ను గెలిపించడం శుభసూచకమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు అన్నారు. గురువారం కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా జానకిరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో లకపాక రాజు, గోలి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలను పంపిణీ చేయాలి

చిట్యాల: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, స్థలాలను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం జరిగిన పార్టీ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్కెనల్లి నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, మండల రూరల్ కార్యదర్శి అర్రూరి శ్రీను, ఐతరాజు యాదయ్య, మేడి సుగుణమ్మ, వెంకన్న, మారయ్య, శంకరయ్య, వెంకట్‌రెడ్డి, కవిత, చంద్రమౌళి, బాలమ్మ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మునుగోడు: భగత్ సింగ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్ట లింగస్వామి కోరారు. ఈ నెల 27వ తేదీ నుంచి 10 రోజుల పాటు నిర్వహించే జయంతి ఉత్సవాల కరపత్రాలను గురువారం మునుగోడులో ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి యనరాని వంశీకృష్ణ, ప్రేమ్‌సాగర్, మురళి, హరీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు టాస్క్‌ఫోర్స్ టీమ్

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చండూరు : చండూరు మున్సిపాలిటీలో ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ భూములను కాపాడడానికి టాస్క్ ఫోర్స్ టీమ్స్ ఏర్పాటు చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం చండూరు మున్సిపాలిటీలో రోడ్డు వెడల్పు పనులు, నాలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు సెంటర్ పాయింట్ నుంచి ఎటూ 50 ఫీట్ల వరకు కచ్చితంగా రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లడానికి అవసరమైతే అండర్ గ్రౌండ్ నాలాలు నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు. చండూరు పట్టణంలో కుమారస్వామి బజ్జీల బండిని ఆయన పరిశీలించారు. ఎలాంటి నూనెలు వాడుతున్నావ్ అంటూ ఆరా తీసి.. ఆయిల్ ప్యాకెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి నాణ్యమైన నూనెతో బజ్జీలు చేయాలని కుమారస్వామికి సూచించారు. పక్కనే ఉన్న కిరాణా షాపును సైతం తనిఖీ చేసి..నూనె ప్యాకెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట నాయకులు, అధికారులు ఉన్నారు.

నేటి మహిళలకు ఐలమ్మ స్ఫూర్తిదాయకం

మర్రిగూడ: బడుగు, బలహీన వర్గాల్లో పుట్టి, నాటి నిరంకుశ నిజాం రాచరిక పాలనకు, జమీందార్ల అణచివేతకు, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం పోరాడిన చాకలి ఐలమ్మ నేటి మహిళలందరికీ స్ఫూర్తిదాయకమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన వెంకటంపేట ఎల్లయ్య /జ్ఞాపకార్థం ఆయన కుమారులు వెంకటంపేట బాలయ్య, చంద్రయ్య మర్రిగూడలో ఏర్పాటు చేసిన ఐలమ్మ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుల నిర్మూలనకు మహిళలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, రజక సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగడాల లింగయ్య, మండల అధ్యక్షుడు కొలుకులపల్లి యాదయ్య, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెన్నమనేని రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, భీమానాయక్, మాస చంద్రశేఖర్, నల్ల యాదయ్య, నక్క శ్రీను, పగిళ్ల సత్యనారాయణ, నక్క తిరుపతయ్య, పుప్పాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడ: ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



చండూరు: అధికారులతో కలిసి కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

వినాయకుడి లడ్డూ ఎమ్మెల్యేకు అందజేత

మునుగోడు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లడ్డూ దక్కించుకున్న చండూరు పట్టణానికి చెందిన లింగోజి కిరణ్‌కుమార్ గురువారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి లడ్డూ అందించాడు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కాలని గణపతిని కోరుకున్నట్లు కిరణ్ తెలిపారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

నాంపల్లి : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాల్లో పాల్గొని అనంతరం నర్సింహులగూడెం గ్రామంలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. విద్యుత్ అధికారులు విద్యాసాగర్, సాగర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత

కనగల్ : మండల పరిధిలోని కురంపల్లి గ్రామానికి చెందిన తలారి కళమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె భర్త కూడా ఐదేళ్ల క్రితం అనారోగ్యానికి గురై మృతిచెందాడు. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం రూ.50వేలను పంపగా.. కళమ్మ కూతురు, కుమారుడికి స్థానిక కాంగ్రెస్ నాయకుడు నంద్యాల లక్ష్మారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తలారి కరుణశ్రీరవీందర్, మాజీ ఎంపీటీసీ తలారి జగాల్, తలారి ఈశ్వరయ్య, నంద్యాల రవీందర్‌రెడ్డి, కొప్పుల జాన్‌రెడ్డి, నంద్యాల సుధాకర్‌రెడ్డి, దోటి వెంకన్న, జెట్టి రాజు, నరసింహ, తలారి వెంకటేశం, వల్కి కళ్యాణ్, పంబాల లక్ష్మణ్ తదితరులున్నార

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో ఇటీవల మృతిచెందిన గుండాల కోటేశ్ కుటుంబానికి అతడి చిన్ననాటి స్నేహితులు బాసటగా నిలిచారు. అతడితోపాటు చదువుకున్న 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ స్నేహితులు గురువారం కోటేశ్ ఇంటికి వెళ్లి రూ. 57 వేలు నగదు అందజేశారు. పెరుమాండ్ల నరేష్, జోలం రమేష్, సత్యనారాయణ, గుండ్లపల్లి శ్రవణ్‌కుమార్, జాల మహేశ్, విశ్వనాథుల రామలింగాచారి, సిరిపంగి ఆంజనేయులు, ముత్యాల నాగరాజు, ఆవుల రవి, గుండాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శాలిగౌరారం: నగదు అందజేస్తున్న స్నేహితులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎడ్ల సైదులు అనారోగ్యం బారిన పడి మంచానికే పరిమితమయ్యాడు. సైదులు దీనస్థితిని తెలుసుకున్న కేతేపల్లి ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చందా రాంమ్మూర్తి బాధిత కుటుంబానికి గురువారం బియ్యం , నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బొల్లెపల్లి అంజయ్య, ఎడ్ల హనోక్, చెరుకు సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రెడ్‌క్రాస్ వితరణ

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని బోయవాడలో గల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు ఇండియా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. కలెక్టర్ నారాయణరెడ్డి అర్బన్ స్కూల్‌ను ఇటీవల సందర్శించి సమయంలో విద్యార్థులకు తగిన దుప్పట్లు లేని విషయాన్ని గుర్తించారు. దీంతో విద్యార్థులకు దుప్పట్లు అందించాలని రెడ్‌క్రాస్ సొసైటీకి సూచించారు. స్పందించిన రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి గురువారం విద్యార్థులకు దుప్పట్లు, పెన్నులు, కూర్చోడానికి పట్టాలు అందజేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు, యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దశరథ, ఊరుకొండ ప్రభాకర్‌రెడ్డి, జానకిరాములు, హుస్సేన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

నూతన కమిటీ ఎన్నిక

నకిరేకల్ : టీఎస్ యూటీఎఫ్ నకిరేకల్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం జరిగిన మండల మహాసభలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటిపాముల నర్సింహమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కుర్మిళ్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బొమ్మిడి శ్రీనివాస్, ఏ.సైదమ్మ, కోశాధికారిగా హరికృష్ణ, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా ఎం.మల్లేష్, మహిళా కన్వీనర్‌గా వై.సునీత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి వ్యవహరించారు.

రేపు కౌన్సిల్ సమావేశం

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన

చండూరు : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ వెంకన్న కోరారు. గురువారం చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ ఘన్‌శ్యాం, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ శ్రీనివాస్, జ్యోతి, పద్మజ పాల్గొన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ జయంతి

నల్లగొండ : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం నల్లగొండ పట్టణంలోని చేనేత పారిశ్రామిక భవన్‌లో నిర్వహిస్తున్నట్లు పద్మశాలి సంఘం జిల్లా కార్యదర్శి రాపోలు దత్తగణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమానికి పద్మశాలి బంధువులంతా హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న శిక్షణ

మునుగోడు: గ్రామాల్లో ప్రజలకు నీటి సరఫరా చేసే పైపులైన్లు పగిలితే వెంటనే మరమ్మతులు చేయించాలని మిషన్ భగీరథ ఈఈ శాంతకుమార్ సూచించారు. నాల జల మిత్రలో భాగంగా నీటి సేవకులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇస్తున్న శిక్షణలో భాగంగా మూడోరోజు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పలు సూచనలు చేశారు. పైపులైన్లతో పాటు వీధుల్లోని చేతి పంపులు రిపేరుకు గురైతే వాటిని మరమ్మతు చేయాలని సూచించారు. డీఈ ముజీబుద్దిన్, ఏఈలు బి.మణిదీప్, రామచంద్రయ్య, మిషన్ భగీరథ ఏఈ అజయ్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ప్రారంభించారు. కంభంపాటి నర్సింహ, అక్కెనపల్లి సతీష్, మహేశ్వరం గాలయ్య, కొత్త శంకరయ్య, భగవంతు, నెల్లికంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు

తిప్పర్తి: మండలంలోని కేశరాజుపల్లి గ్రామ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై గురువారం తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న తిప్పర్తి మండలం పాతపల్లి గ్రామానికి చెందిన ఎస్‌కే కఫీర్ బైక్‌పై నల్లగొండ నుంచి పాతపల్లికి వెళ్తుండగా.. కేశరాజుపల్లి వద్ద కారు ఢీకొని మృతిచెందాడు. అయితే కఫీర్‌ను ఉద్దేశపూర్వకంగానే హత్య చేశారని జానీబాయ్ అనే వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తుండడంతో మృతుడి బావమర్ది షేక్ అహ్మద్‌పాషా ఫిర్యాదు మేరకు జానీబాయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ తెలిపారు.